మహిళల కబడ్డీ విజేతగా వీబీఐటీ



ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడల్లో అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల మహిళల కబడ్డీ జట్టు విజేతగా నిలిచింది. ముఖ్యఅతిథిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి దిలీప్ హాజరై షీల్డ్‌తో పాటు మెమొంటో అందజేశారు. డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌రెడ్డి, రవీంద్ర ఏక్లార్కర్, క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

గ్రూప్-1లో మెరిట్ సాధించిన శివానీకి సత్కారం



కీసర: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించిన దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడకు చెందిన శివానీని శనివారం నాగారం సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, పాఠశాల కార్యదర్శి నోముల వసంతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రూప్ -1లో అహ్మద్‌గూడకు చెందిన పన్నిరు శ్రీనివాస్‌బాబు, సరస్వతీ దంపతుల కుమార్తె శివానీ తమ పాఠశాల 2015-2016 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని కావడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఆమె ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

మేడ్చల్: మేడ్చల్ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంస్థ తరుపున డీఎం సుధాకర్ మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలో శ్రమిస్తున్న ఉద్యోగుల కోసం డిపోలో మజ్జిగ స్టాల్‌ను ఏర్పాటు చేసి అందజేస్తున్నామన్నారు. ఉద్యోగులు, అసిస్టెంట్ మేనేజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం

మల్లాపూర్: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి హనుమాన్‌నగర్‌కు చెందిన కీర్ రాకేష్‌సింగ్ హెచ్‌సీఎల్ రిటైర్డ్ ఉద్యోగి (57) మల్లాపూర్ మానిక్‌చంద్ నుంచి తన ద్విచక్రవాహనంపై 11.30 నిముషాలకు తిరుమల మిలీనియర్ వద్ద ఉన్న బిడ్జి వద్ద అదుపు తప్పింది. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు కొమ్మలు నరకడానికి వెళ్లి..

కిందపడి వ్యక్తి మృతి

అల్వాల్: చెట్టు కొమ్మలు నరకడానికి వెళ్లి కాలు జారి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ హిల్స్‌లో నివసించే జంపల్ (49) లేబర్ పనిచేస్తుంటాడు. ఈనెల 14న ఫాదర్ బాలయ్యనగర్‌లోని ఒక ఇంటి ఆవరణలో చెట్టు కొమ్మలు నరుకుతూ ఉండగా కాలు జారి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 సాయంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

పోచారం: ఓ మహిళ అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. బొమ్మగళ్ల శివ, నవలత దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి అన్నోజిగూడలోని డీమార్టు సమీపంలో నివాసం ఉంటున్నారు. నవలత (23) ఓ వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతుంది. ఈ విషయాన్ని బంధువుల సమక్షంలో ఈనెల 9న పంచాయతీ పెట్టారు. కాగా 13న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా నవలత తన కుమారుడిని తీసుకుని 15వ తేదీన తిరిగి ఇంటికి వచ్చింది. ఈ ఘటన జరిగిన తర్వాత 15వ తేదీనే బొమ్మలరామారం మండలంలోని తమ స్వగ్రామమైన నాగినేనిపల్లికి వెళ్లాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సామగ్రి సర్దుకున్నారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో నవలత తన ఫోన్‌ను ఇంట్లోనే వదిలేసి వెళ్లిపోయింది. తన భార్య వెళ్లిపోవడానికి బూరుగు అజయ్‌గౌడ్ కారణమని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బీమాతో మహిళలకు భరోసా !

మహిళా శక్తి పేరిట సంఘాలకు ప్రత్యేక రుణాలు

ఉచిత రుణ, ప్రమాద బీమాతో ఆర్థికసాయం

18 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న వారికి వర్తింపు

జీపీ, పురపాలికల్లోని 1,09,361 సభ్యులకు ప్రయోజనం

సాక్షి,సిటీబ్యూరో: మహిళా శక్తి పేరుతో ప్రత్యేక రుణాలు అందించడానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, వారి కోసం రెండు రకాల బీమా పథకాలను అమలులోకి తీసుకొచ్చింది. ఉచితంగా రుణ బీమాతో పాటు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. పొదుపు సంఘంలో రుణం తీసుకున్న మహిళ ప్రమాదవశాత్తు మరణిస్తే.. రుణమాఫీతో పాటు ప్రమాద బీమా ద్వారా ఆర్థికసాయం అందనుంది. ఈ బీమాతో గ్రామ పంచాయతీలతో పాటు పుర పాలక సంఘాల్లోని పొదుపు సంఘాల మహిళాసభ్యులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఈ రెండు రకాల బీమా పథకాలు కూడా అమలులోకి వచ్చాయి.



1.09 లక్షల మహిళా సభ్యులకు వర్తింపు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని రూరల్ ప్రాంతంలో 13 పురపాలక సంఘాలు ఉండగా, ఐదు మండలాల పరిధిలో 34 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని డీఆర్డీఏ, మెప్మా అధ్వర్యంలో 10,750 స్వయం సహాయక మహిళా సంఘాలు పనిచేస్తుండగా.. ఇందులో 1,09,361 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం అమలుచేయనున్న రెండు బీమాలు ప్రయోజనాన్ని చేకూర్చనున్నాయి.

72,450 మంది సభ్యులు

జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో 5 మండలాలకు ఒక జిల్లా సమాఖ్య, 5 మండల సమాఖ్యలు, 3,395 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండగా.. వీటి పరిధిలో 36,911 మంది సభ్యులు ఉన్నారు.

◆ మెప్మా అధ్వర్యంలో 13 పురపాలక సంఘాల పరిధిలో 13 టౌన్ లెవల్ మహిళా సమాఖ్యలు, 208 ఏరియా లెవల్ మహిళా సమాఖ్యలు, 7,245 మహిళా సంఘాలు పనిచేస్తుండగా.. ఇందులో 72,450 మంది సభ్యులు ఉన్నారు.

చిరు వ్యాపారులకు రుణాలు

ఈ సంఘాల్లోని సభ్యులు చిరు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, మహిళాశక్తి పథకాల ద్వారా వివిధ రుణాలను ప్రభుత్వం అందజేస్తోంది.

ప్రమాదబీమా రూ.10 లక్షలు

స్వయం సహాయక (పొదుపు) మహిళా సంఘాల మహిళలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఉచిత బీమా వర్తింపజేయనున్నారు. ఒకవేళ 100 శాతం వైకల్యం కలిగినా రూ.10 లక్షలు అందిస్తారు. 50 శాతం వైకల్యం ఉంటే రూ.5 లక్షలు చెల్లిస్తారు. మృతిచెందిన మహిళకు పొదుపు అప్పు ఉంటే అది పూర్తిగా మాఫీ చేస్తారు.

సరైన ధృవీకరణపత్రాలు అందజేయాలి

గాయాలైన మహిళలకు అంగవైకల్యం తెలిపే ధ్రువీకరణ పత్రాలు, చికిత్స పొందిన ఆసుపత్రి పత్రాలు సమర్పించాలి. మరణించిన వారి పోస్టుమార్టం నివేదిక, పోలీసుల పరిశోధన నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. 18 నుంచి 60 ఏళ్లున్న మహిళలకు మాత్రమే ఇది వర్తింపజేస్తారు.

క్షేత్రస్థాయిలో అవగాహన లేదు

బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం లేదు. ఈ రెండు పథకాల్లో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపుల వారు నెలవారీ సమావేశాలు నిర్వహించాలి. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి. ఇలాంటి వాటిపై మహిళల్లో పూర్తిస్థాయిలో అవగాహన లేదు. చాలా గ్రూపుల్లో నెలవారీ సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదు. దీనిపై సెర్ప్, మెప్మా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

ఎంతో ప్రయోజనం

మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారికి రెండు రకాల బీమా సౌకర్యం కల్పించడంతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వ నిర్ణయంతో సభ్యుల కుటుంబాలకు రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. దీనిపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించేలా సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సీఎం దిష్టిబొమ్మ దహనం

అల్వాల్: సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలు, కేసీఆర్ అభిమానుల మనోభావాలను దెబ్బతీసేలా మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఓల్డ్ అల్వాల్ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఉమ్మడి కరీంనగర్ విద్యానగర్ ప్రాంతానికి చెందిన పుల్లారెడ్డి కుమారుడు సీహెచ్. రాజేశ్వర్‌రెడ్డి(50) తన ద్విచక్ర వాహనం(ఏపి 29 ఏటీ-7285)పై ఉప్పల్ భగాయత్ నుంచి నాగోల్ రోడ్డు వైపునకు వస్తుండగా ఫైర్‌స్టేషన్ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో రాజేశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అతడు ఈసీఐఎల్ సాకేత్‌నగర్‌లో నివాసం ఉండేవాడని సమాచారం.

'బహుజన పితామహుడు కాన్షీరాం'



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నేతలు

మల్లాపూర్: బహుజన రాజ్యాధికార పితమహుడు కాన్షిరాం అని దళిత సంఘాల జేఏసీ వ్యవస్థాపకుడు నల్లా రాధాకృష్ణ కొనియాడారు. శనివారం నాచారంలో కాన్షీరాం 91వ జయంతిని దళిత సంఘాల జేఏసీ నాచారం డివిజన్ కన్వీనర్ కరాటే శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నల్లా రాధాకృష్ణ మట్లాడుతూ.. త్వరలోనే నాచారంలో కాన్షీరాం విగ్రహాన్ని ఏర్పాటు చేసి కాన్షీరాం ఫౌండేషన్ చైర్మన్ సర్దకీర్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేస్తామన్నారు. ఆర్‌ఎస్. ప్రసన్నకుమార్, అంజి, హెచ్‌ఆర్.మోహన్, వేముల మారయ్య, బొజ్జ యాదగిరి, అమరేందర్, క్రిష్టారెడ్డి, నల్లబాబు, వెంకటేష్, యుగేంధర్, నరేష్ తదితరులున్నారు.

'ఆపరేషన్ కగార్' ను విరమించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న షేక్ షావలి

జవహర్‌నగర్: కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను వెంటనే విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి అన్నారు. శనివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ విముక్తి) ఇచ్చిన పిలుపులో పెర్క సునీత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మహిళలు అసమానతలు, వివక్షతను నేటికి ఎదుర్కొంటున్నారని, మహిళలు సంఘటితంగా ఏకమై తమ హక్కులను తాము సాధించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై కక్ష కట్టి కేంద్ర బలగాలను ఉసిగోల్పుతున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేసి దేశంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేలా చొరవ తీసుకోవాలని సూచించారు. పద్మ, యమున, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం జాడేదీ ?

అన్నోజిగూడలోని సర్వేనెంబర్ 14లో కనిపించని 2.21 ఎకరాల ప్రభుత్వ భూమి

- రూ. 25 కోట్ల విలువైన భూమిని ఆరగించిన కబ్జాదారులు
- సర్వే నంబరును మార్చి విక్రయించారని స్థానికుల ఆరోపణ


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వివరిస్తున్న మాజీ కౌన్సిలర్ వెంకటేష్‌గౌడ్



కొలతలులేని సర్వే నెంబర్ 14 మ్యాప్

పోచారం: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా, పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలోని సర్వే నెంబర్ 14లో 2.21 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 15 ఎకరాల విస్తీర్ణంలో రాజీవ్ గృహకల్ప కాలనీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మిగిలిన 5.21 గుంటల భూమిని 2002లో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద ఇళ్లు నిర్మించేందుకు కేటాయించారు. కానీ 2007లో ఆర్డీఓ ఉత్తర్వుల ద్వారా మూడెకరాల భూమిని మాత్రమే జీహెచ్‌ఎంసీకి అప్పగించారు. ఇందులో 296 ఫ్లాట్లు నిర్మించి దివ్యాంగుల కాలనీగా నామకరణం చేశారు.

మిగిలిన భూమిపై కబ్జాదారుల కన్ను..

మిగిలిన 2.21 గుంటల భూమిపై కబ్జాదారుల కన్నుపడింది. 2014లో ఈ భూమిని ప్లాట్లుగా విభజించి, సర్వే నెంబరు 14ను 15గా మార్చి ప్లాట్లు చేసి అమ్మేశారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకోవాలి..

అన్యాక్రాంతమైన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని స్థానిక నేతలు 2016లో జిల్లా కలెక్టర్‌తో పాటు హౌసింగ్ బోర్డు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేశారు. తిరిగి నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలి..

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలంటూ స్థానిక నేతలు తహసీల్దార్‌తో పాటు ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు 2021లో ఏడీ సర్వే చేసి, వికలాంగుల కాలనీ వెనుకవైపున హద్దురాళ్లు పాతారు. క్రమంగా హద్దురాళ్లు కనుమరుగు కావడంతో తిరిగి నిర్మాణాలు వెలిశాయి.

పెన్సింగ్ ఏర్పాటు చేయాలి..

ఇటీవల ఈ సమస్యను తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ దృష్టికి మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్‌గౌడ్ తీసుకెళ్లారు. 2.21 గుంటల ప్రభుత్వ భూమికి హద్దులు గుర్తించి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఘట్‌కేసర్ మండల తహసీల్దార్‌ను కోరుతూ వినతిపత్రం అందజేశారు.

అధికారుల్లో అయోమయం..

2.21 గుంటల ప్రభుత్వ భూమి వికలాంగుల కాలనీ సమీపంలోని వాటర్ ట్యాంక్ వైపు ఉందని ఓసారి, ఘణపూర్ వెళ్లే రోడ్డు వైపు ఉందని మరోసారి అధికారులు పేర్కొనడంతో గందరగోళం నెలకొంది. తాజాగా నక్క రాములు ఇంటివైపు ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సుమారు 10 మంది ఇళ్ల యజమానులకు ఫిబ్రవరి నెలలో తహసీల్దారు నోటీసులు జారీ చేశారు. 'ఎందుకు మీ ఇళ్లను తొలగించకూడదో' రాతపూర్వకంగా వివరణ కోరారు. దీంతో వారిలో భయాందోళన మొదలైంది.

వేర్వేరు చోట్ల ఇద్దరు కార్మికుల ఆత్మహత్య


జగదీష్‌రాయ్ (ఫైల్)

కుషాయిగూడ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ కార్మికుడు ఆత్మహత్య చేసుకోగా మరో కార్మికుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు శనివారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగాయి. ఎస్సై హరిందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బతుకు దెరువు కోసం ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వలస వచ్చిన అరుణ్ (22) అనే కార్మికుడు చర్లపల్లి, బీఎన్‌రెడ్డినగర్‌లోని భవానీ ఫ్రోజెన్ కంపెనీలో కార్మికుడిగా పని చేసుకుంటూ కంపెనీ గదిలోనే నివాసం ఉంటున్నాడు. ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతుండేవాడు. ఈ క్రమంలో హోలీ పండుగ రోజు సెలవు కావడంతో తోటి మిత్రులతో కలిసి మద్యం తాగాడు. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో తాను ఉంటున్న గదిపై అంతస్తులోని రేకుల గదిలోకి వెళ్లి ఇనుప రాడుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

జార్ఖండ్‌కు చెందిన మరో వ్యక్తి..

జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జగదీష్‌రాయ్ (30) చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఆదిగురు పాలిమర్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. హోలీ సెలవు కావడంతో మిత్రులంతా కలిసి విందు చేసుకుని మద్యం సేవించారు. అప్పటి వరకు అందరితో కలిసి ఉన్న జగదీష్‌రాయ్ కనిపించకుండా పోయాడు. గుర్తించిన మిత్రులు అతడి అదృశ్యంపై చర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జగదీష్ అచూకీ కోసం వెతకగా శనివారం ఉదయం 8 గంటల సమయంలో హెచ్‌సీఎల్ కంపెనీకి చెందిన ఖాళీ ప్రదేశంలోని ఓ చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. మృతుడు అదృశ్యమైన జగదీష్‌రాయ్‌గా పోలీసులు గుర్తించారు. స్నేహితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయో కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

హామీలు అమలు చేయాలి

కాప్రా: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్‌పీఆర్డీ ప్రతినిధులు అన్నారు. శనివారం కమలానగర్ భాస్కర్‌రావుభవన్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్డీ మేడ్చల్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ. 4 వేలు ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. దివ్యాంగులకు చేయూతనివ్వాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివ్యాంగులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలనే డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా లక్ష సంతకాల సేకరణ చేపట్టినట్లు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చకుంటే వేలాది మందితో సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

రామంతాపూర్ : గోఖలేనగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సీనియర్ బీజేపీ రాష్ట్ర నాయకుడు గడ్డం సాయికిరణ్ శనివారం ఆలయ ప్రతినిధి రాఘవేంద్రనాయక్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా అయ్యప్ప దీక్షతో అన్ని శుభాలే జరగడమే కాకుండా మనశ్శాంతి, ఆరోగ్యం, ఆనందం కలుగుతుందన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

'ఆస్తి పన్ను చెల్లించకపోతే ఇళ్లను సీజ్ చేస్తాం'



బోడుప్పల్: ఆస్తిపన్ను చెల్లించని ఇళ్లను సీజ్ చేస్తామని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. చెంగిచర్లలో ఓ షెడ్డు యజమాని ఆస్తిపన్ను చెల్లించలేదని శనివారం మున్సిపల్ సిబ్బంది సీజ్ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను బకాయిలు రూ.15.46 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఆస్తిపన్ను చెల్లించని వారికి రెడ్ నోటీస్ జారీ చేస్తున్నామన్నారు. సకాలంలో చెల్లించని వారికి చరాస్తి మున్సిపల్ చట్టం -2019 అనుసరించి జప్తు చేస్తామన్నారు. ఆస్తిపన్ను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

హోలీ వేడుకల్లో యువకుడిపై కత్తితో దాడి

ఇద్దరు నిందితుల రిమాండ్


నిందితుడు శివశంకర్


జయక్రిష్ణ చౌదరిగూడ

మేడిపల్లి: హోలీ వేడుకల్లో జరిగిన చిన్న గొడవ కత్తిపోట్లకు దారి తీసింది. ఈ ఘటనలో యువకుడిపై కత్తితో దాడికి పాల్పడిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్ల ద్వారకానగర్ కాలనీకి చెందిన ఉప్పు ఆదిత్య (24) తన స్నేహితులైన సన్నీ, సుహాస్, సాయి, శ్రవణ్‌లతో కలిసి శుక్రవారం నారాపల్లి హోలీఖేల్ వేడుకలకు వెళ్లారు. ఈ వేడుకల్లో సౌండ్ సిస్టమ్ వద్ద కాలు తగిలిందని, నారాపల్లికి చెందిన శివశంకర్‌యాదవ్, చౌదరిగూడకు చెందిన జయక్రిష్ణ మధ్య తోపులాట జరిగింది. తిరిగి వెళ్లేందుకు ఆదిత్య తన స్నేహితులతో నారాపల్లి చౌరస్తా వద్ద నిలబడి ఉండగా.. శివశంకర్, జయక్రిష్ణ యాక్టీవా వాహనంపై వచ్చి ఆదిత్యపై కత్తితో కడుపు, ఛాతీపై దాడిచేసి పరారయ్యారు. ఈ దాడిలో బలమైన గాయాలైన ఆదిత్యను స్థానికులు, స్నేహితులు చికిత్స నిమిత్తం ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు.

పాత నాణేలు ఆశచూపి..

డబ్బులు కాజేసిన కేటుగాళ్లు

మేడిపల్లి: ఇంట్లో ఉన్న పాత నాణేలను పంపిస్తే అధిక డబ్బులు ఇస్తామని రూ.1,30,000లు సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాపల్లిలో నివాసం ఉంటున్న ఓ మహిళ ఇన్‌స్టా చూస్తున్నప్పుడు పాతనాణేలు పంపితే పెద్దమొత్తంలో డబ్బులు ఇస్తామని ఓ ప్రకటన కనిపించింది. దీంతో తన దగ్గర ఉన్న నాణేల ఫోటోలను ఇన్‌స్టాగామ్‌లో షేర్ చేసింది. దీనికి ఫలితంగా రూ.46లక్షలు అందిస్తామని వారు బాధితురాలిని నమ్మించారు. దీంతో ఆమె వారికి ఆధార్‌కార్డుతో పాటు ఫోటోను పంపించింది. దీనికి ప్రాసెసింగ్ చార్జీలు రూ.770 చెల్లించాలని తెలపడంతో పంపించింది. తర్వాత ఆమెకు డబ్బులు తీసుకుని వస్తున్న వ్యక్తిని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని, నమ్మించి పట్టుపడిన వ్యక్తి రిలీజ్ కావడానికి రూ.1,30,000 అవసరమని చెప్పి కాజేశారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

మల్కాజిగిరి: ఓ యువతి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జేఎల్‌ఎస్‌నగర్‌కు చెందిన లక్ష్మీభారతి, రాములు భార్యాభర్తలు. కాగా పది రోజుల నుంచి దమ్మాయిగూడలో నివాసం ఉంటున్నారు. కుమార్తె వైష్ణవి పెళ్లి విషయంలో తల్లిదండ్రులతో గొడవపడింది. ఈనెల 14న రాత్రి తల్లికి వైష్ణవి ఫోన్ చేసి ఎక్కడున్నారని అడిగింది. తిరిగి కుమార్తెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుమార్తె ఆచూకీ కోసం ఆందోళన చెందిన ఆమె జేఎల్‌ఎస్‌నగర్‌కు రాగా కుమార్తె ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై హరిందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన మితిలేష్‌కుమార్ (25) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఎలక్ట్రిక్ బైక్‌పై కేబుల్ నుంచి చర్లపల్లి వైపుగా వెళ్తూ బైక్ అదుపు తప్పి కరంట్ పోల్‌కు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.